ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 256
మంగళవారం 29 సెప్టెంబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



మంగళగిరిలో 372 మందికి ఇంటి పట్టాలు పంపిణీ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 28)

మంగళగిరి నియోజకవర్గంలో 80 శాతం పట్టాల సమస్య పరిష్కారమైందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కుంచనపల్లిలో 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా 372 మందికి ఉచితంగా ఇంటి పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన మెజారిటీ కారణంగానే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సొంత నిధులు కూడా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. "ఇప్పటికే రెండు విడతల్లో 5,636 మందికి పట్టాలు ఇచ్చి రూ.2 వేల కోట్ల విలువైన భూములకు ఆస్తి హక్కులు కల్పించాం. మంగళగిరిలో పునాది వేసిన ఈ కార్యక్రమాన్ని విశాఖ, విజయవాడతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నాం. ▶2లో

చిత్తూరు జిల్లాలో మరోసారి ఏనుగుల సంచారం.. అధికారులను అప్రమత్తం చేసిన పవన్ కల్యాణ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 28)

చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను, రైతులను భయాందోళనలకు గురిచేస్తున్న ఏనుగుల గుంపును వెంటనే అడవిలోకి సురక్షితంగా మళ్లించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముసలమడుగు శిబిరం నుంచి కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. సోమవారం పడిపుట్లబైలు సమీపంలో ఏనుగుల సంచారంపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత 15 రోజులుగా 11 ఏనుగులతో కూడిన గుంపు, ▶2లో



ఆ ఫార్ములానే నన్ను గెలిపించింది

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 28)

ఎన్నికల్లో గెలుపు మజా ఇస్తుందని.. ఓడిపోతే.. నీరసం వస్తుందని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. అయితే.. గెలుపుతోపాటు ఓటమిని కూడా బలంగా తీసుకోవాలని సూచించారు. 2019లో తాను ఓడిపోయినప్పుడు.. అనేక అవమానాలు ఎదురయ్యాయని తెలిపారు. అయితే.. వాటిని సవాలుగా తీసుకుని.. మళ్లీ ఓడిపోయిన చోటే పోటీ చేయాలని అనుకున్నట్టు తెలిపారు. ఎందుకు ఓడిపోయామో అధ్యయనం చేసి.. దానిని సరిచేసుకుని ముందుకు సాగానని చెప్పారు. ఇదే ఫార్ములా నాయకులకు వర్తిస్తుందన్నారు.

ఓటమి తర్వాత కుంగిపోయి.. నియోజకవర్గాలకు దూరంగా ఉంటే ఇబ్బందులు పెరుగుతాయన్నారు. తాను ఓడిపోయినా.. నియోజకవర్గంలో పర్యటించి ప్రజలను నిరంతరం కలుసుకుని.. వారికి హామీలు ఇచ్చానని గుర్తు చేసుకున్నారు. ఆ నమ్మకమే తనను 93 వేల ఓట్ల మెజారిటీతో గెలిచేలా చేసిందని లోకేష్ వివరించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎటు చూసినా అభివృద్ధి కనిపిస్తోందన్నారు. ప్రతి విషయాన్నీ రాజకీయ కోణంలోనేకాకుండా.. ప్రజల కోణంలో తాను ఆలోచన చేస్తానన్నారు.

తాజాగా సోమవారం ఉదయం మంగళగిరి నియోజకవర్గంలోని 347 మంది పేదలకు ఇళ్ల పట్టాలను నారా లోకేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పట్టాల సమస్య పరిష్కరిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పట్టుదలతో పనిచేస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు 2 వేల కోట్ల రూపాయల విలువైన ఇళ్ల పట్టాలను పేదలకు పంపిణీ చేశామని వివరించారు. ఇక ముందు కూడా ఈ యజ్ఞం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా పట్టాదారులకు బట్టలు పెట్టి.. కానుకలు అందించారు. ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేయించారు.

చేసింది చెప్పాలి..ప్రతి ఎమ్మెల్యే తమ తమ నియోజకవర్గాల్లో పర్యటించాలని లోకేష్ పిలుపునిచ్చారు. చేసింది చెప్పుకోవాలన్నారు. ప్రభుత్వ పరంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని.. వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అదేసమయంలో ఎమ్మెల్యేలు వ్యక్తిగతంగా చేస్తున్న మంచిని కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. టీడీపీ చేపట్టిన ఇంటింటికీ కార్యక్రమం హిట్ అయిందన్నారు. వచ్చే ఏడాది కూడా ఈ కార్యక్రమం మరోసారి సాగుతుందన్నారు. ఎన్నికల లోగా.. మూడు సార్లయినా.. ప్రతి మంత్రి, ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ తిరిగేలా ప్రజలకు మంచిని వివరించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

ఉగ్రవాదానికి దీటుగా బదులిచ్చాం

మన సత్తాను ప్రపంచానికి చాటాం
మెరుపు దాడులకు నేటితో పదేళ్లు
మన్ కీ బాత్‌లో గుర్తు చేసిన ప్రధాని



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 28)

ఉగ్రవాదం చేసే గాయాలకు భారత్ ఎలాంటి నిర్ణయాత్మక స్పందన చూపిస్తుందనేది ఇప్పటికే రుజువు చేశామని, మన విధానం ఎలా ఉంటుందో చెప్పేందుకు ఉదాహరణగా నిలిచామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గత పదేళ్లలో బాలాకోట్ గగనతల దాడుల నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు స్పష్టమైన సందేశాన్ని పలుమార్లు పంపించామని చెప్పారు. సరిగ్గా పదేళ్ల క్రితం.. 2016 సెప్టెంబరు 28, 29 తేదీల్లో పాక్‌లోని ఉగ్రవాద తండాలపై మన సైన్యం వీరోచితంగా విరుచుకుపడి ముష్కరులను మట్టుబెట్టిన సందర్భాన్ని ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన గుర్తు చేసుకున్నారు. ఉగ్రవాద దాడులతో దీర్ఘకాలం దేశంపడ్డ వేదనకు మెరుపు దాడులతో సరికొత్త ▶2లో

జగన్ పాలనలో బీసీలకు ద్రోహం: మంత్రి కొల్లు రవీంద్ర



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 28)

మాజీ మంత్రి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గం చీపురుపల్లిలో వైకాపాకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బొత్స బంధువు, మాజీ జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తెదేపాలో చేరిన తర్వాత జిల్లా వ్యాప్తంగా వైకాపాలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. అది ఇప్పుడు విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం మెరకముడిదాం మండలానికి పాకింది. ఈ మండలంలో ఒకేసారి 13 గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు వైకాపా ▶2లో

జగన్ మౌనంగా ఉండాల్సింది.. !



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 28)

కేంద్రంలోని ఎన్డీయేకి పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వకపోయినా.. ఎన్డీయే కూటమిలో భాగస్వామి కాకపోయినా.. వైసీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. సమయం, సందర్భం చూసుకుని ఎన్డీయేకు మద్దతు ప్రకటి స్తోంది. రాష్ట్రపతి నుంచి ఉపరాష్ట్ర పతి ఎన్నికల వరకు.. పలు రకాల బిల్లుల నుంచి సమర్థించే విషయాల వరకు కూడా కేంద్రంలోని మోడీ సర్కారుకు వైసీపీ మద్దతు తెలుపుతోంది. ఇది 2014 నుంచి కొనసాగుతున్న ప్రక్రియే. అయితే.. తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహారం ప్రస్తుతం వివాదంగా మారడంతో ఈ విషయంలో ఎన్డీయేను సమర్థిస్తున్న కొన్ని పార్టీలు సైతం పెదవి విరుస్తున్నాయి. కేంద్రం నుంచి ఎన్నికల సంఘం వరకు సమాధానం చెప్పాలని కోరుతున్నాయి. ఇక, కొన్ని పార్టీలు.. అంటే బీఆర్ ఎస్, డీఎంకే వంటివి మౌనంగా ఉన్నాయి. కేంద్రం ఎక్కడ ఆగ్రహం వ్యక్తం చేస్తుందోనన్న బెంగ ఆయా పార్టీల్లో కనిపిస్తోంది. దీంతో ఆయా పార్టీలు మౌనంగా ఉంటున్నాయి.

కానీ, ఈ సమయంలో అనూహ్యంగా జగన్ స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఆయన సుదీర్ఘ పోస్టు పెట్టారు. దీనిలో ఒకవైపు కేంద్రంపై సునిశిత విమర్శలు గుప్పిస్తూనే మరోవైపు.. ఎన్నికల సంఘం పారదర్శకతను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారం జాతీయస్థాయిలో రాజుకుంది. జగన్ చేసిన పోస్టును కొన్ని మీడియా ▶2లో

జగన్ పాలనలో బీసీలకు ద్రోహం



జగన్ పాలనలో బీసీలకు తీవ్ర ద్రోహం జరిగిందన్న మంత్రి కొల్లు రవీంద్ర

బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని ప్రకటన

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 28)

జగన్ ప్రభుత్వ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో బీసీలను వెన్నుపోటు పొడిచిన వైసీపీ నాయకులు, ఇప్పుడు దొంగ నాటకాలు ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు.వైసీపీ ప్రభుత్వం బీసీలను రాజకీయంగా అణగదొక్కే ఉద్దేశంతోనే స్థానిక సంస్థల్లో ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించిందని మంత్రి ఆరోపించారు. దీనివల్ల ▶2లో

15 వేల ప్రమోషన్లు ఇచ్చాం.. ఇంకా ధర్నాలెందుకు?



సచివాలయ ఉద్యోగుల డిమాండ్లపై మంత్రి స్వామి

ఉద్యోగులను వైఎస్ జగన్ రెచ్చగొడుతున్నారని మంత్రి స్వామి ఆరోపణ

అక్రమ ధర్నాలు, ఒత్తిళ్లు సహించేది లేదని హెచ్చరిక

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 28)

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇప్పటికే 15 వేల మందికి పైగా ప్రమోషన్లు ఇచ్చామని, సమస్యలు పరిష్కరిస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని రాష్ట్ర మంత్రి డీఎస్‌బీవీ స్వామి స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అక్రమంగా ధర్నాలు చేస్తే సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు.సోమవారం అమరావతిలో మంత్రి స్వామి మీడియాతో ▶2లో

కొరిశపాడు పీహెచ్‌సీలో సమీక్ష





(షణ్ముఖ వెలుగు, అద్దంకి, సెప్టెంబర్ 28)

కొరిశపాడు: కొరిశపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లతో డీడీవో అక్షిత ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి అక్షిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఐఆర్ఎస్ కాల్స్‌లో నెగిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైద్యశాలకు వచ్చే ప్రజలతో సఖ్యతగా మెలిగి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ ఆఫీసర్ బుజ్జిబాబు, సుబ్బారావు, మేరమ్మ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

మంగళగిరిలో 372 మందికి ఇంటి పట్టాలు పంపిణీ

వచ్చే ఏడాది 100 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తెస్తాం. రానున్న ఎన్నికల్లోగా ప్రతి ఇంటికీ తాగునీరు, భూగర్భ డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తాం. కేంద్రం పరిధిలోని భూముల సమస్యలపై కూడా సంప్రదింపులు జరుపుతున్నాం. 2029 నాటికి నియోజకవర్గంలో అర్హులందరికీ పట్టాలు అందిస్తాం" అని లోకేశ్ తెలిపారు.

చిత్తూరు జిల్లాలో మరోసారి ఏనుగుల సంచారం.. అధికారులను అప్రమత్తం చేసిన పవన్ కల్యాణ్

దాని నుంచి విడిపోయిన మరో రెండు ఏనుగులు పడిపుట్లబైలు పంచాయతీ పరిధిలోని పుండ్లవల్లపల్లి, నడింపల్లి, కొండకిందపల్లి గ్రామాల్లో సంచరిస్తున్నాయని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఏనుగులు వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఒక ఏనుగుల గుంపు రహదారి దాటి మంగళంపేట బీట్‌లోకి ప్రవేశించగా, మరో రెండు ఏనుగులు చిత్తూరు వైపు కదులుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ ఏనుగుల సంచారం వల్ల పాకాల, పులిచెర్ల, చంద్రగిరి మండలాల ప్రజలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మానవ-ఏనుగు ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. "ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. అటవీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖలు, హనుమాన్ బృందాలు సమన్వయంతో పనిచేయాలి. క్షేత్రస్థాయి బృందాలు నిరంతరం నిఘా ఉంచి, ప్రమాదం పొంచి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలి" అని ఆయన స్పష్టం చేశారు.

ఏనుగుల వల్ల పంట నష్టపోయిన రైతులకు తక్షణం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూసుకుంటూనే, ఏనుగులను సురక్షితంగా తిరిగి అటవీ ప్రాంతంలోకి మళ్లించే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల భద్రత, పంటల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఉద్ఘాటించారు.

జగన్ మౌనంగా ఉండాల్సింది.. !

ఛానెళ్లు ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి. ఎన్డీయే కు అంశాల వారీగా మద్దతు ఇచ్చే పార్టీలుకూడాఇప్పుడు ప్రశ్నిస్తున్నాయని వారు చెబుతున్నారు. ఇక, జగన్ చేసిన పోస్టులో కీలక సూచన చేశామని అనుకుంటున్నా.. అది కేంద్రానికి మంటపుట్టిస్తోంది.ఎందుకంటే.. ఆ లైన్.. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండడమే. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌ను ఎంపిక చేసే కమిటీలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిని కూడా చేర్చాలన్నది జగన్ సూచన. దీనినే కాంగ్రెస్ పార్టీ సహా.. మోడీపై నిప్పులు చెరుగుతున్న వారు కోరుతున్నారు. ఇప్పుడు మోడీకి అనుకూలంగా ఉన్న జగన్ కూడా ఈ వాదనను తెరమీదికి తీసుకురావడం, స్కూలు-విద్యార్థి-ఇన్‌విజిలేటర్ సూత్రాన్ని ఆపాదించడం వంటివి కేంద్రానికి మంట పుట్టిస్తున్నాయి. దక్షిణాది నుంచి కేంద్రాన్ని ప్రశ్నిస్తున్న వైసీపీ పార్టీ ఇలా వ్యవహరించడాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకుందని కూడా అంటున్నారు. మరి ముమ్ముందు ఏం జరుగుతుందో చూడాలి.

జగన్ పాలనలో బీసీలకు ద్రోహం

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16,800 మంది బీసీలు తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తమ ప్రభుత్వం బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించేందుకు చిత్తశుద్ధితో ఉందని, ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి, అందుకు అనుగుణంగా కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.బీసీల రక్షణ కోసం ప్రత్యేకంగా "బీసీ రక్షణ చట్టాన్ని" తీసుకురానున్నట్లు కొల్లు రవీంద్ర ఈ సందర్భంగా ప్రకటించారు. నారా లోకేశ్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే ఈ చట్టానికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైందని ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల అభ్యున్నతి కోసం బడ్జెట్‌లో రూ.32,534 కోట్లను కేటాయించిందని, వారి ఆర్థిక స్వావలంబన కోసం పటిష్ఠమైన చర్యలు తీసుకుంటోందని వివరించారు. జగన్ పాలనలో బీసీలపై దాడులు జరిగినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం మత్స్యకారులు, చేనేత కార్మికులు, వడ్డెరలు వంటి అన్ని వర్గాలకు ప్రత్యేక పథకాల ద్వారా భరోసా కల్పిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

15 వేల ప్రమోషన్లు ఇచ్చాం.. ఇంకా ధర్నాలెందుకు?

మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ఆందోళనలపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించారు. గత ప్రభుత్వం సరైన సర్వీస్ రూల్స్ లేకుండా నోటిఫికేషన్లు ఇచ్చిందని, తమ ప్రభుత్వం వాటిని సరిదిద్దిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో సచివాలయ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించినట్లు వివరించారు. దీనిలో భాగంగా రెండు క్యాజువల్ లీవులను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వాడుకునే వెసులుబాటు కూడా కల్పించామని చెప్పారు.ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనల వెనుక ఎవరున్నారనే దానిపై విచారణ జరుపుతామని చెబుతూనే, ఈ ఆందోళనలకు జగనే కారణమని మంత్రి స్వామి ఆరోపించారు. "గతంలో రూ.15,000 జీతానికి రెండేళ్లు పనిచేసినప్పుడు నిరసన తెలపని వారు, ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించారు. గత పీఆర్సీలో వీరిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?" అని నిలదీశారు.

కొన్ని డిమాండ్లపై మంత్రి స్పష్టత ఇచ్చారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఎవరికీ ఇవ్వడం సాధ్యం కాదని, కాబట్టి సచివాలయ ఉద్యోగులకు కూడా ఇవ్వలేమని తేల్చిచెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగానే చూస్తున్నామని, గత ప్రభుత్వం నియమించిందన్న వివక్ష తమకు లేదని అన్నారు. వారి కోసం ప్రత్యేకంగా ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేసిందే తమ ప్రభుత్వమని గుర్తుచేశారు. వారి సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అయితే ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఉగ్రవాదానికి దీటుగా బదులిచ్చాం

స్పందనను చూపించామని చెప్పారు.

డ్రగ్స్ నిర్మూలనలో పాలు పంచుకోండి

మాదక ద్రవ్యాల నిర్మూలన ఉద్యమంలో యువత పాలుపంచుకుని ఆ మహమ్మారిని తుద ముట్టించాలని మోదీ పిలుపునిచ్చారు. "ఇటీవల లక్షల మంది యువతీ యువకులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిన బూనారు. ఈ సందేశాన్ని అందరికీ వ్యాప్తి చేసే బాధ్యతను తీసుకున్నారు. 'మాదకద్రవ్య రహిత యువజన ఉద్యమం' 100 వారాలు కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా వేలాది ప్రతిజ్ఞలు, అవగాహన కార్యక్రమాలు జరిగాయి. మన యువత ఈ సందేశాన్ని వారి సొంత భాషలో, వారి సొంత పద్ధతిలో వ్యాప్తి చేస్తున్నారు. 'మన్ కీ బాత్'లో ఇచ్చిన పిలుపునకు వేల మంది యువత స్పందించి, ముందుకు రావడం సంతోషంగా ఉంది" అని ప్రధాని తెలిపారు. ఆదివారంనాటి కార్యక్రమాన్ని ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్‌లో 40వేల మంది ఆలకించి ప్రపంచ రికార్డు సృష్టించారని భాజపా నేత తరుణ్ చుగ్ వెల్లడించారు.

ఏపీ యువతకు అభినందన

ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో యువత పురాతన మెట్ల బావులను శుభ్రం చేసి పునరుద్ధరిస్తుండడం, ప్రతిజ్ఞలు చేయడం వంటి వాటిని మోదీ అభినందించారు. దానికి సంబంధించిన చిత్రాలను ప్రదర్శించారు. ఒక చిత్రంలో ఏపీ మంత్రి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణి ఉన్నారు. ముంబయిలో బీచ్‌ల పరిశుభ్రత, దిల్లీలో వ్యర్థాల సేకరణ, బెంగాల్‌లో మార్కెట్ ప్రదేశాల నుంచి చెత్తను తొలగిస్తుండటం వంటివి ప్రస్తావించారు.



అభివృద్ధి మాది అరాచకం మీది

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టెంబర్ 28)

అభివృద్ధి మాది-అరాచకం మీది అని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని 19, 20, 21, 22 వార్డుల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్‌తో కలిసి పర్యటించి పలు సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుని ఎక్కడ పై వార్డుల్లో సీసీ రోడ్లు అవసరమని ప్రజాభీష్టం మేరకు పలు రోడ్లు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలను అడిగి వారి యోగక్షేమాలను తెలుసుకొని వార్డులకు అవసరమైన పలు విషయాలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం జిల్లా కేంద్రమైన మార్కాపురం మున్సిపాలిటీకి రూ.35 కోట్ల రూపాయల కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధుల ద్వారా మార్కాపురం పట్టణంలోని అవసరమైన ప్రతి రోడ్డును సిసి రోడ్డుగా మారుస్తామని, భవిష్యత్తు అవసరాల దృష్ట శివారు ప్రాంతాల్లో కూడా సిసి రోడ్లు వేస్తామని తెలియజేశారు. మార్కాపురం జిల్లా, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి, ఇంటింటికి పైప్ లైన్, హార్టికల్చర్ హబ్ ద్వారా ఈ ప్రాంతాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం ఈ రకంగా చేయలేదని, ఒక్క కూటమి ప్రభుత్వంతోనే ఇదంతా సాధ్యమవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానిక వార్డు ప్రజలు, తెలుగుదేశం నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.









పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం పై ప్రత్యేక చొరవ చూపండి అధికారులకు జిల్లా కలెక్టర్ విజయ సునీత ఆదేశం



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 28)

ప్రజల నుంచి అందుతున్న పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రత్యేక చొరవతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. సోమవారం మార్కాపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సైతం భూ, ఇతర సమస్యలకు సంబంధించి అర్జీలు వస్తున్నాయని తెలిపారు. సమస్యలను కేవలం అర్జీలుగా నమోదు చేసి వదిలివేయకుండా, వాటి మూల కారణాలను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పిజిఆర్ఎస్ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలే అధికంగా వస్తున్నాయని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఒకే సమస్యపై ప్రజలు పదేపదే అర్జీలు సమర్పించే పరిస్థితి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్యలు తిరిగి పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో మొత్తం 216 అర్జీలు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 134, ఇతర శాఖలకు సంబంధించి 82 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలకు సంబంధించిన సమస్యలపై 96 అర్జీలు అందినట్లు వివరించారు. ముంపు గ్రామాల ప్రజల సమస్యలను కూడా ప్రాధాన్యతతో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, మార్కాపురం, కనిగిరి ఆర్డీవోలు వెంకట శివరామిరెడ్డి, అజయ్ కుమార్, హౌసింగ్ పీడీ మోహన్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ ఇన్చార్జి అధికారి బాలాజీ నాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ షాహీర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.







షణ్ముఖ
తెలుగు
ప్రతి వార్త తెలుగు వైపు
తెలుగు దినపత్రిక
29.09.26 మంగళవారం

రాజకీయం కొసం "పొదిలి" ని అణగదొక్కిన పాపం గతపాలకులదే

ఐదుసంవత్సారాలు అధికారాన్ని అనుభవించి స్వార్థ రాజకీయాలు చేశారు

అమృత్ 2 కింద రూ.169 కోట్లతో ఇంటింటికి పైప్ లైన్

పొదిలికి మంజూరైన హెచ్ఏఎం కింది రూ.20 కోట్లతో సిసి రోడ్లు ఏర్పాటు









(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టంబర్ 28)

రాజకీయం కోసం పొదిలి నగర పంచాయతీని గత పాలకులు అణగదొక్కారని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వైసీపీ నేతల పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం పొదిలి నగర పంచాయతీలో పొదిలికి హెచ్ఏఎం కింద మంజూరైన రూ.20 కోట్లతో వేసే రోడ్లకు సంబంధించి కాటూరివారిపాలెం, రాజుపాలెం, బాప్టిస్ట్ పాలెం, టైలర్స్ కాలనీ, రామ్‌నగర్, బుచ్చెనపాలెం ఎస్సీ పాలెంలోఆయన కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన పొదిలి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పొదిలి ప్రెస్‌క్లబ్‌కు ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు హాజరయ్యారు. అనంతరం ఆయన ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పొదిలి పట్టణం పట్ల గత వైసీపీ నాయకుల పనితీరు పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో వైసీపీ నాయకులు రాజకీయం కోసం పొదిలిని తీవ్రంగా అణగదొక్కారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ ప్రజలకు, ఈ పొదిలి ప్రాంతానికి మంచి జరగాలని అనే ఉద్దేశ్యంతో ఈ ప్రాంత ప్రజలకు ఫ్లోరిన్ సమస్య లేకుండా శాశ్వతంగా తొలగించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భారీగా నిధులు కేటాయించారన్నారు. ఆయనకు పొదిలి ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. గత పాలకులు పెద్దచెరువుకు నీరు ఇస్తామని చెప్పి రూ.50 కోట్లు కేటాయించామని చెప్పి శంకుస్థాపనలు చేసి టపాసులు కాల్చుకున్నారన్నారు. కానీ కాంట్రాక్టర్లకు, అప్పటి నాయకుల మధ్య ఏం జరిగిందో తమకు తెలయదన్నారు. కానీ ఫైనాన్స్ అలకేషన్ లేకుండా మీకే టెండరు ఇస్తామని చెప్పి పనులు చేయించారన్నారు. పాపం అమాయక ప్రజలందరూ వైఎస్ఆర్ పార్టీ నాయకులు పెద్ద చెరువుకు నీరు తీసుకువస్తారని నమ్మారన్నారు. తీరా వాస్తవాలను పరిశీలిస్తే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తాను వ్యక్తిగతంగా పరిశీలించి రూ.50 కోట్లకు ఫైనాన్స్ అలకేషన్ తీసుకువచ్చి పనులు చేయిస్తున్నామన్నారు. అంతటితో ఆగకుండా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు నిధులు కూడా విడుదల చేయించి ఇప్పించామన్నారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సాగర్ జలాలపై ఆధారపడిన ఈ ప్రాంతంలో సాగర్ అక్రమ కనెక్షన్లు పెట్టుకుని నిజమైన పేద వాడికి నీరు రాకుండా చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికి తాగునీరు అందించాలనే ధృడ నిశ్చయంతో ముఖ్యమంత్రి (తరువాయి 4లో...)

ఒంగోలు మునిసిపాలిటీ 150 సంవత్సరాలు పూర్తి

ఒంగోలు ఉత్సవాన్ని జయప్రదం చేయండి

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు పిలుపు

ఉత్సవానికి హాజరు కానున్న పలువురు ప్రముఖులు

ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న ఎడ్ల అందాల ప్రదర్శన

ఈ నెల 30న భారీ ఏర్పాట్లు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 28)

ఒంగోలు మునిసిపాలిటీ 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 30వ తేదీన నిర్వహిస్తున్న ఒంగోలు ఉత్సవం వేడుకలను జయప్రదం చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దామచర్ల మాట్లాడుతూ ఒంగోలు మున్సిపాలిటీ 150 సంవత్సరాల వేడుకలలో భాగంగా ఈపాటికే ఒంగోలు చర్చి సెంటర్లో అశోక చక్రం స్తూపం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే గతంలో ఎన్నడూ లేనివిధంగా 150 సెంటర్లలో 150 ఉచిత వైద్య శిబి రాలు ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేయ డం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రైవేటు వైద్య శాలల డాక్టర్లు, సిబ్బంది తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు అన్నారు. అనంతరం వరల్డ్ రికార్డు బుక్స్ లో ఎక్కేలా పారిశుధ్యం పై ప్రజలలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిం దన్నారు. ఈ సందర్భంగా తనతో పాటు, ఒంగోలు ఎంపీ మాగు ంట శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ప్రజలలో మమేకమై అవగాహన కల్పిం చడం జరిగిందన్నారు. ఆ తర్వాత ఆదివారం హెరిటేజ్ వాక్ గతం లో ఎన్నడూ లేని విధంగా వేలాదిమంది ప్రజలు, యువత, విద్యా ర్థులు, డాక్టర్లు, ఇంజనీర్లు, వ్యాపారులు, మహిళలతో కలిసి ఒక మంచి మెసేజ్ వచ్చేలా నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే 30వ తేదీన జరిగే కార్యక్రమాలకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్ప వరపు వెంకయ్య నాయుడు, ఒరిస్సా గవర్నర్ ఖమ్మంపాటి హరిబా బు, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇన్చార్జి మినిస్టర్ ఆనం నారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, (తరువాయి 4లో...)

ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ విజయ సునీత ఆదేశం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 28)

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తలెత్తే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. సోమవారం మార్కాపురం కలెక్టరేట్‌లో ఎల్‌నినో పరిస్థితులు, వాటి ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, మైక్రో ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం రానున్న రోజుల్లో ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అధికారులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. జిల్లాలోని నీటి వనరులు, ఎస్ఎస్ ట్యాంకుల పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి నిల్వలపై మున్సిపల్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి సరఫరా పరిస్థితిని (తరువాయి 4లో...)



రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది

మంత్రి నిమ్మల రామానాయుడు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 28)

ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొని రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సోమవారం నిర్వహించిన పునర్నిర్మాణ పనులు చేపట్టిన కారుమంచి మేజర్ కాలువ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దిగువ ప్రాంతంలో 16 వేలకు పైగా ఎకరాలకు సాగునీరు, 16 గ్రామాలకు తాగునీరు అందించడంలో ఈ మేజర్ కెనాల్ కీలక పాత్ర పోషిస్తుం దన్నారు. రైతులు, స్థానిక ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు రూ.2.63 కోట్ల డీఎంఎఫ్ నిధులతో పాటు పి-4 కార్యక్రమం కింద స్థానిక ప్రముఖులు వెంకట శేషయ్య అందించిన రూ.25 లక్షలతో 500 మీటర్ల కాంక్రీట్ గట్టును నిర్మించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల వ్యవస్థను చక్కదిద్దుతున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనే నీటి వనరుల నిర్వహణ కోసం రూ.1308 కోట్లు ఇచ్చామన్నారు. (తరువాయి 4లో...)



మార్టూరు రోడ్డుకు భారీ నిధులు ప్రజలు సంబరాలు

మార్టూరు-కొణిదెన రోడ్డుకు రూ.3.50 కోట్లు

ఎమ్మెల్యే సాంబన్న కృషి ఫలించిందాంటూ ఆనందం

ఏళ్ల నాటి కష్టాలకు తెర..స్వీట్లు పంచిన ప్రజలు

నిధులు మంజూరుతో మార్టూరులో కోలాహలం

'జై చంద్రబాబు.. జై సాంబన్న'అంటూ నినాదాలు



(షణ్ముఖ వెలుగు, మార్టూరు, సెప్టంబర్ 28)

ఏళ్లుగా గుంతలు, దుమ్ము, ధూళితో అవస్థలు పడుతున్న మార్టూరు-కొణిదెన రహదారికి మహర్దశ పట్టనుంది. రోజూ వేలాది మంది రైతులు, కూలీలు, విద్యార్థులు, వ్యాపారులు రాకపోకలు సాగించే ఈ ప్రధాన రహదారి ఇక సరికొత్త తారురోడ్డుగా మారనుంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషితో రహదారి పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసింది.

3.05 కిలోమీటర్ల మేర తారు రోడ్డు... మార్టూరు నుంచి కొణిదెన రోడ్డు వరకు విజయనగర్ కాలనీ మీదుగా వెళ్లే రహదారిని పునర్నిర్మించనున్నారు. వీబీజీరామ్‌జీ పథకం కింద మొత్తం సుమారు 3.05 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం జరగనుంది. 2026-27 సంవత్సరానికి వీబీజీ రామ్‌జీ పథకం కింద పర్చూరు నియోజకవర్గంలో మార్టూరు-కొణిదెన రహదారి పనులకు రూ.3.50 కోట్లు కేటాయించారు.

సంబరాల్లో మార్టూరు...

రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైన సమాచారం తెలియడంతో మార్టూరులో స్థానిక నాయకులు, ప్రజలు ఆనందోత్సాహాలతో సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంచుకుని, బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషితోనే రహదారి పునర్నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని పేర్కొంటూ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రజలు, స్థానిక నాయకులు "జై చంద్రబాబు.. జై సాంబన్న" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏళ్లుగా ఎదుర్కొంటున్న రహదారి సమస్యకు పరిష్కారం లభించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. (తరువాయి 4లో...)

రాజకీయం కొసం "పొదిలి" ని అణగదొక్కిన పాపం గతపాలకులదే















ఈ చంద్రబాబునాయుడుతో పలు దఫాలు చర్చించి అమృత్ 2 క్రింద 169 కొట్లతో 100 సంవత్సరాలకు నీటి ఎద్దడి లేకుండా చేస్తున్నామని తెలిపారు. అందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా ముగిసిపోయిందన్నారు. త్వరలనో పనులకు శంకుస్థాపన కూడా చేయించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఎవ్వరు కష్టాపడుతున్నారో ఎవ్వరు అభివృద్ధికి పట్టంకడుతున్నారో గమనించాలన్నారు. ప్రజలు స్వార్థ రాజకీయ నాయకుల మాటలు నమ్మకుండా ప్రజా ప్రభుత్వాన్ని విశ్వసించి రాబోవు మున్సిపల్



ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించి పొదిలి పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఆయన కొరారు. పొదిలి ప్రెస్ క్లబ్ సొంత భవనానికి వారం రోజుల్లో స్థల కేటాయింపు చేయిస్తానని, జర్నలిస్టు మిత్రులందరికీ ఇళ్ళ స్థలాలు కూడా త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. మీడియా సమావేశం ముగిసిన అనంతరం ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొదిలి నగర పంచాయతీ కమిషనర్



రామ్మోహన్‌రావు, పొదిలి నగర పంచాయతీ క్లస్టర్ ఇన్‌ఛార్జి వరికుంట్ల అనిల్, మండల, పట్టణ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, ముల్లా ఖుద్దూస్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, మాజీ జడ్పీటిసి కాటూరి వెంకట నారాయణబాబు, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, జిల్లా ముస్లిం మైనార్టీసెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, కాటూరి శ్రీను, మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లిఖార్జున, మాజీ వైస్ సర్పంచ్ షేక్ జిలాని, ముని శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు మునిసిపాలిటీ 150 సంవత్సరాలు పూర్తి ఒంగోలు ఉత్సవాన్ని జయప్రదం చేయండి



జిల్లా మంత్రులు స్వామి, రవికుమార్, గుంటూరు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఎంఎస్ రాజు, ఎరపనేని శ్రీనివాసరావు, మైనార్టీ వ్యవహారాల సలహా అధ్యక్షులు షరీఫ్, జిల్లా ఎమ్మెల్యేలు నాగేశ్వరరావు, ఎంఎం కొండయ్య, బి ఎన్ విజయ్ కుమార్, కందుల నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ఏలూరి సాంబశివరావు, మండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్, గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్ బాబు, లతో పాటుగా పలు కార్పొరేషన్ చైర్మన్లు లంక దినకర్, దామచర్ల సత్య, తేజస్విని, డాక్టర్ నూకసాని బాలాజీ, షేక్ రియాజ్, విజయ్ కుమార్, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కామేపల్లి సీతారామయ్య, కాశిరెడ్డి, ముప్పవరపు సుచిత్ర పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలుకు సంబంధించిన 150 మంది ప్రముఖులను సత్కరించుకోవడం జరుగుతుందన్నారు. మినీ స్టేడియంలో ఏర్పాటు చేసే ఈ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. పలు స్టాల్స్, పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. పలు కళారూపాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ప్రపంచంలో ఎక్కడి లేనివిధంగా ఒంగోలు జాతి గిత్తల అందాల ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భోజన ఏర్పాట్లు, పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఒంగోలు దగ్గర 150 సంవత్సరాలు ఉత్సవాలు చరిత్రలో నిలిచిపోయేలా ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మీడియా సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ రాచ గర్ల వెంకట్రావు, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య, నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్ పాల్గొన్నారు.

మార్టూరు రోడ్డుకు భారీ నిధులు ప్రజలు సంబరాలు

రహదారి పూర్తయితే రైతులు పంట ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడం, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు రాకపోకలు సాగించడం మరింత సులభం కానుంది. ఈ సందర్భంగా మార్టూరు నేతలు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

ప్రతిరోజూ పర్యవేక్షించాలని ఆదేశించారు. నీటి కొరత ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చొరవ చూపాలని స్పష్టం చేశారు. అదే విధంగా జిల్లాలో ప్రస్తుత వ్యవసాయ పంటల పరిస్థితి, వర్షపాతం, తదితర అంశాలను వ్యవసాయ శాఖ అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ఎలాంటి పంటలు వేస్తే రైతులకు మేలు చేకూరుతుందో తెలియజేస్తూ వారికి పూర్తిగా అవగాహన కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని శాఖల సమన్వయంతో ఎల్ నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందుకు సాగుదామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయశాఖ ఇన్చార్జ్ అధికారి బాలాజీ నాయక్, జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఫణీంద్ర కుమార్, డ్వామా పీడీ సువార్త, మైక్రో ఇరిగేషన్ పీడీ జెన్నెమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది











రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం అని వ్యాఖ్యానించారు. రాయలసీమకు హంద్రీనీవా జలాలు తీసుకురావడంతో పాటు వెలిగొండ ప్రాజెక్టులోకి నీళ్లు, ఉత్తరాంధ్రకు గోదావరి వరద జలాలను తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాదికి పూర్తి చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐదు నెలలలోపే ఈ పనులను పూర్తి చేసినందున దిగు ప్రాంతాల్లోని ప్రజలకు త్రాగు, సాగునీటి అవసరాలు తీరబోతున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలోని ఇతర పనులను కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. 'జలధార – జల హారతి' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మూడువేలకు పైగా పనులను పూర్తి చేసామన్నారు. వర్షాలు వచ్చిన తర్వాత వాటి ఫలితాలు అందుతాయి అన్నారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన సాగునీటి సౌలభ్యం కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ దిశగా తీసుకుంటున్న చర్యలే దీనికి నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వాటర్ మ్యాన్ గా, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును డిప్యూటీ వాటర్ మ్యాన్ గా దేశవ్యాప్తంగా గుర్తిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. వెలుగొండ, పోలవరం ప్రాజెక్టుల పట్ల వారు చూపిన ప్రత్యేక శ్రద్ధే దీనికి కారణం అన్నారు. 2014-19 కాలంలో ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం చెక్కు డ్యాములను నిర్మించింది అన్నారు. ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ త్రాగు, సాగునీటి అవసరాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఎంతో కీలకమైన వెలుగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి ఇటీవల ప్రారంభించారని, ప్రస్తుతం గ్రానైట్ ప్రాంతమైన చీమకుర్తిలో అభివృద్ధికి మరింత ఊతం ఇచ్చేలా అభివృద్ధి పరచిన కారుమంచి కాలువను జల వనరులశాఖామంత్రి ప్రారంభిస్తుండటం సంతోషకరమన్నారు. ఈనెల 30వ తేదీన ఒంగోలులో నిర్వహించే మున్సిపాలిటీ 150 ఏళ్ల వేడుకలలో పాల్గొనాలని ప్రజలకు ఈ సందర్భంగా జనార్ధన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సుచిత్ర, స్థానిక ప్రముఖులు నల్లూరి వెంకట శేషయ్య, ఏఎంసీ చైర్మన్ మన్నం ప్రసాద్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, స్థానిక ప్రముఖులు, అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు





(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 28)

ప్రకాశం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న మార్కాపురంలోని ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికల్లో కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-18 విభాగంలో బాలిశెట్టి ధరణి 200 మీటర్ల పరుగు పందెంలో, కంచి వెంకటలక్ష్మి షాట్‌పుట్‌తో పాటు 200 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారిణులు కర్నూలు జిల్లా ఆదోనిలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రకాశం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినిలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది వై. వీర నారాయణ, సత్య రామారావు, వై.ఎల్. శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు సంపంగి సుబ్రమణ్యం, కదిరిపోగు విజయ్‌కుమార్ అభినందించారు. విద్యార్థినిలు రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

అంగన్‌వాడీ కేంద్రం నందు పోషణ మాసోత్సవాలు





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టంబర్ 28)

కనిగిరి మండలం బల్లిపల్లి అంగన్వాడి కేంద్రం నందు పోషణ మాసోత్సవాల్లో భాగంగా "అంగనవాడి ఉత్సవం" కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎన్ పార్వతి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కనిగిరి బిజెపి మండల అధ్యక్షులు జి మనోజ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కిషోర్, మాల్యాద్రి, మహిళా నాయకురాలు సిహెచ్ అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారం, మాతృ సంరక్షణ, వాక్సినేషన్, గర్భిణీ ,బాలింతలు, 6-3 సంవత్సరాల పిల్లలకు ఇంటికి ఇచ్చే పోషక పదార్థాలు గురించి వివరించిరి. బిజెపి అధ్యక్షులు మనోజ్ రెడ్డి మాట్లాడుతూ గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవ సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప యాత్రలో భాగంగా అంగనవాడి ఉత్సవాలు ఈ నెల 25 నుండి అక్టోబర్ 7 వరకు అన్ని కేంద్రాలలో నిర్వహిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వము ఇచ్చే సంక్షేమ పథకాలను, ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం , మిషన్ ఇంద్రధనసు, కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలనుగురించి తెలియజేశారు. తదుపరి నిస్వార్థంగా సేవ చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను, ఆయాలను ప్రశంసించి, షర్మిల కార్యకర్తను సన్మానించారు. జాతీయ పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. అంగనవాడి ఉత్సవం పై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు జి మనోజ్ రెడ్డి, ఉపాధ్యక్షులు కిషోర్, మాల్యాద్రి మహిళా నాయకురాలు సిహెచ్ అరుణ, ఎంఎల్‌హెచ్‌పి రాజేశ్వరి, ఏఎన్ఎం వసంత కుమారి, అంగన్వాడి కార్యకర్తలు షర్మిల, రాజ్యలక్ష్మి, అరుణ, వరలక్ష్మి, శిరీష, రజిని గ్రామంలోని గర్భవతులు, బాలింతలు, తల్లులు, ఏంసి సభ్యులు, పిల్లలు పాల్గొన్నారు.

చెంచు కాలనీ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

రూ.17 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ
రూ.6 లక్షల ఆర్వో ప్లాంట్ ప్రారంభం

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టంబర్ 28)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని చెంచు కాలనీలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే దిశగా మరో కీలక అడుగు పడింది. చెంచు కాలనీలో రూ.17 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఈ రోజు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. చెంచు కాలనీ అభివృద్ధిలో భాగంగా చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణంతో కాలనీ ప్రజలకు రాకపోకలకు మరింత సౌకర్యం కలగడంతో పాటు, వర్షాకాలంలో రహదారులు దెబ్బతినడం, బురదమయంగా మారడం వంటి ఇబ్బందులు తగ్గనున్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

భూమిపూజ అనంతరం చెంచు కాలనీ ప్రజలతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో విద్యుత్ సౌకర్యం, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, కొత్త ఇళ్ల మంజూరు తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు వివరించిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే శ్రద్ధగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

నూతనంగా మంజూరైన గృహ నిర్మాణానికి శ్రీకారం

చెంచు కాలనీకి చెందిన కుటుంబానికి నూతనంగా మంజూరైన గృహ నిర్మాణ పనులను కూడా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గారు ప్రారంభించారు. నూతనంగా మంజూరైన ఇంటికి కొబ్బరికాయ కొట్టి, గృహ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రతి అర్హ కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ కార్యక్రమాల ద్వారా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే గారు తెలిపారు.

రూ.6 లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ ప్రారంభం

కాలనీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు రూ.6 లక్షల నిధులతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే గారు ప్రారంభించారు. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపేలా ఈ ఆర్వో ప్లాంట్‌ను వినియోగించుకోవాలని, ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందేలా సంబంధిత సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

కుల ధ్రువీకరణ సమస్య పరిష్కారానికి హామీ

ఈ సందర్భంగా చెంచు సామాజిక వర్గ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న కుల ధ్రువీకరణ పత్రాల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్య పై ఎమ్మెల్యే స్పందిస్తూ చెంచు సామాజిక వర్గ ప్రజలకు కుల ధ్రువీకరణ పత్రాల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రాధాన్యత

ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం, కాలనీల అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. చెంచు కాలనీ అభివృద్ధికి అవసరమైన మరిన్ని చర్యలను దశలవారీగా చేపడతామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.













కరేడు సెక్టార్ ఇందిరానగర్ ఎస్టి కాలనీలో అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 28)

ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలోని కరేడు సెక్టార్ ఇందిరా నగర్ ఎస్టి కాలనీ నందు సిడిపిఓ డి మాధవి లత ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవంలో భాగంగా అంగన్వాడి ఉత్సవం నిర్వహించడం జరిగింది. అంగన్వాడి సెంటర్ నందు వారు అందించిన సేవలను గుర్తించిన గర్భవతులు, తల్లులు, బాలింతలు చక్కగా అంగన్వాడి కార్యకర్తలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తల్లులకు జెండా రంగులో ఉన్న ఆహారం మునగాకును కూడా రోజు తినే ఆహారంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు తిరుపతమ్మ, సుగుణ ,ఆశ వర్కర్ ,ఎంపీపీ ఎస్ స్కూల్ హెచ్ ఎం సుబ్బారెడ్డి పాల్గొని పోషణ విలువలు కలిగిన ఆహారం గురించి వివరించారు.

వెళ్తున్నాను గణపయ్యా... మళ్లీ వచ్చే ఏడాది కలుద్దాం...!

భక్తుల పూజలు అందుకుని, ఆశీస్సులు పంచి సాగుతున్న బొజ్జగణపయ్య

(ఉబ్బా అశోక్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఒంగోలు, సెప్టంబర్ 28)





ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలకు నిర్దేశిత గడువులోనే నాణ్యమైన పరిష్కారం చూపాలి

జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 28)

జిల్లా కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పాల్గొని, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులు, అర్జీలను నేరుగా స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా తమ సమస్యలను విన్నవించుకోవడానికి వచ్చిన బాధితుల నుండి సోమవారం మొత్తం 307 అర్జీలు నమోదయ్యాయి. జాయింట్ కలెక్టర్ ప్రతి ఒక్కరి సమస్యను ఓపిగ్గా విని, వాటి తక్షణ పరిష్కారం కోసం సంబంధించిన విభాగాధిపతులకు మార్గదర్శనం చేశారు. అర్జీల స్వీకరణ అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు, స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీ అత్యంత కీలకమైనదని, అధికారులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలని తేల్చి చెప్పారు. అర్జీలను పరిష్కరించడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అర్జీదారుడు పూర్తి సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయి పరిశీలన పక్కాగా జరగాలని ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒకే సమస్య పై ప్రజలు పదేపదే కలెక్టరేట్ చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదని, పునరావృతమయ్యే (రీ-ఓపెన్) అర్జీల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా భూసంబంధిత, రెవెన్యూ, ఇతర శాఖల మధ్య నలిగిపోయే సమస్యలలో విభాగాలు పరస్పర సమన్వయంతో వ్యవహరించి వేగవంతంగా బాధితులకు న్యాయం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



శ్వాస మీద పట్టు సాధిస్తే మనిషికి ఏకాగ్రత పెరుగుతుంది

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టంబర్ 28)

శ్వాస మీద పట్టు సాధిస్తే మనిషికి ఏకాగ్రత పెరుగుతుందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం పట్టణంలోని మార్కెట్ యార్డులో "ఆర్ట్ ఆఫ్ లివింగ్" కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి తెలుగుదేశం నాయకులతో కలిసి ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా "ఆర్ట్ ఆఫ్ లివింగ్" గురువు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఎలా నేర్చుకోవాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. సాధన అనంతరం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ శ్వాస పై ధ్యాస ఉంచితే మనిషికి ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా మనిషి శరీరంలోని అవయవాలు ఉత్తేజమవుతాయని, శరీరం కూడా మానసింగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు దైనందిక జీవితంలో ఒక అరగంట "ఆర్ట్ ఆఫ్ లివింగ్" ప్రాక్టీస్ చేయాలని, తద్వారా మనిషి ఆరోగ్యంగా ఏ రకంగా జీవించవచ్చునో తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ స్వయంప్రతిపత్తి కళాశాలలో

యువత భవితకు భరోసా కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టంబర్ 28)

యువత భవితకు భరోసా కార్యక్రమంలో భాగంగా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ప్రత్యేకంగా ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. నేటి విద్యార్థులు, నిరుద్యోగ యువతలో భవిష్యత్తుపై ఉన్న ఆందోళనలు, అపోహలు, సందేహాలను తొలగించి వారిలో ఆత్మవిశ్వాసం నింపడం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు, స్టార్టప్, స్వయం ఉపాధి పథకాల గురించి యువతకు అవగాహన కల్పించి, వారి బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇవ్వడమే ఈ కార్యక్రమ లక్ష్యం. యువతతో నేరుగా సంభాషించడం, వారి ఆకాంక్షలను తెలుసుకోవడం, వారి భవిష్యత్తు పట్ల భరోసా కల్పించడం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ముందుగా ఆయన సెమినార్ హాలులో షహీద్ భగత్ సింగ్, మహాకవి గుర్రం జాషువా గార్ల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా సంభాషించారు. కార్యక్రమం అంతటా విద్యార్థులు పాటించిన క్రమశిక్షణను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాలలోని విద్యా వాతావరణాన్ని, హరితహార కార్యక్రమాలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తరగతి గదుల కోసం 40 సీలింగ్ ఫ్యాన్లను విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఉదారంగా ప్రకటించారు. అంతేకాకుండా, విద్యార్థుల చిరకాల కోరిక అయిన ఎన్‌సిసి యూనిట్‌ను త్వరలోనే కళాశాలలో పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కళాశాల ఆవరణలో అభివృద్ధి చేసిన మియావాకి ఫారెస్ట్ ప్రాజెక్టును సందర్శించి, ఈ వినూత్న హరిత కార్యక్రమాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. విద్యార్థులు, సిబ్బందితో కలిసి ఫోటోలు దిగారు. ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన రసాయన శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె వి పద్మావతిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తన విలువైన సమయాన్ని కేటాయించి విద్యార్థులతో స్ఫూర్తిదాయకంగా సంభాషించి, ఉదారంగా సహాయాన్ని ప్రకటించిన ఎంపీకి ప్రిన్సిపాల్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







కరువు సాయంగా ఏపీకి రూ.లక్ష కోట్లు ఇవ్వాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలి
సీపీఐ రాష్ట్ర ప్లీనరీ సందర్భంగా కడపలో భారీ ర్యాలీ, బహిరంగ సభలి





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టెంబర్ 28)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు, పశువులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్ల కరువు సహాయాన్ని రాష్ట్రానికి మంజూరు చేయాలని సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది.

సీపీఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాల సందర్భంగా సోమవారం కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుంచి నేక్‌నామ్ కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నేక్‌నామ్ కళాక్షేత్రంలో భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా బహిరంగ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శులు, మాజీ శాసనసభ్యులు కె. రామకృష్ణ, పల్లా వెంకట్రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన సహాయక చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి, కరువు నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర కరువు బృందాలను రాష్ట్రానికి రప్పించి పరిస్థితులను పరిశీలించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

రైతులు, వ్యవసాయ కూలీలు, పశువులను కరువు బారి నుంచి కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్ల ప్రత్యేక కరువు సహాయం అందించాలని, ఉపాధి హామీ పథకం నిధులను రెట్టింపు చేసి గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాయలసీమతో పాటు ఉత్తరాంధ్ర ప్రాంతాలు భవిష్యత్తులో కరువు బారిన పడకుండా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దళారుల దోపిడీని అరికట్టి నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ఆయనను తొలగించాలని సభలో నాయకులు డిమాండ్ చేశారు. ఈ బహిరంగ సభకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి, కడప జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మైదుకూరు నియోజకవర్గం నుంచి సీపీఐ వైఎస్సార్ కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగ సుబ్బారెడ్డి, పి. శ్రీరాములు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి. సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్, సీపీఐ మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్. షా వల్లి, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఏ.వి. శివరాం, నాయకులు ఈశ్వరయ్య, డి. సుబ్బరాయుడు, బి.వి. శ్రీనివాసులు, బత్తల పీరయ్య, ఎస్. బాలసుబ్బయ్య, విజయలక్ష్మి, జయరాజు, సాలమ్మ, సుంకన్న, దానం, చీపాడు బాలుడు తదితరులు పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు బివి బాలాజీ, పి చేతన్, ప్రశాంత్ తదితరులతో పాటు మైదుకూరు నియోజకవర్గానికి చెందిన సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో కడపకు తరలివెళ్లి బహిరంగ సభలో పాల్గొన్నారు.

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయం కుక్కమూడి ప్రసాద్





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 28)

నవయుగ కవి చక్రవర్తి మహాకవి గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయమని దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ కుక్క ముడి ప్రసాద్ అన్నారు. మహాకవి గుర్రం జాషువా 131వ జయంతి సందర్భంగా సోమవారం మాచర్ల పట్టణంలోని ఆయన విగ్రహానికి కుక్కమూడి ప్రసాద్ ఆధ్వర్యంలో దళిత ప్రజా సంఘాలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలను తన రచనలు, కవిత్వం ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన మహాకవి గుర్రం జాషువా అని, సమాజంలోని అంటరానితనం , అస్పృశ్యత, కులవివక్షను నిర్మూలించడానికి తన యొక్క కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని పోరాడిన సామాజిక విప్లవకారుడు మహాకవి గుర్రం జాషువా అని ఆయన సేవలను కొనియాడారు. ఆయన అందించిన సేవలకు భారత ప్రభుత్వం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పద్మభూషణ్ అనేకమైనటువంటి బిరుదులను ఇవ్వటం జరిగిందని తన రచనలు కవిత్వం ద్వారా ఈ సమాజాన్ని మేల్కొల్పినటువంటి వ్యక్తి గుర్రం జాషువా అని యువత ఆయన యొక్క రచనలను కవిత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని ప్రసాద్ అన్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర జాతీయ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గురజాల అప్పారావు మాట్లాడుతూ గుర్రం జాషువా జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయనకు నివాళులర్పించటం గర్వంగా ఉందని ఇలాంటి మహాకవులను ప్రతి ఒక్కరూ జ్ఞాపకం చేసుకొని సమాజంలోనే అంటరానితనం నిర్మూలన కోసం కృషి చేయాలన్నారు. బీసీ నవ చైతన్య వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు బొడ్డుపల్లి ఈశ్వరయ్య మాట్లాడుతూ గుర్రం జాషువా ని స్మరించుకోవడం సంతోషంగా ఉందని ఆయన యొక్క ఆశయాలను సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని ఆయన అన్నారు.

పొదిలిలో ఘనంగా గుర్రం జాషువా, భగత్ సింగ్ జయంతి వేడుకలు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 28)

మహాకవి, సామాజిక వేత్త, కవికోకిల, పద్మ విభూషణ్ గుర్రం జాషువా జయంతి, అమరవీరుడు భగత్ సింగ్‌ల జయంతి వేడుకలను పొదిలిలోని గుర్రం జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ పొదిలి శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుర్రం జాషువా కళాపీఠం గౌరవ అధ్యక్షుడు కేవీ రమణారెడ్డి అధ్యక్షతన పద్య నాటక కళాకారులను శాలువాతో ఘనంగా సత్కరించి దుస్తులను బహుకరించారు. సంస్థ అధ్యక్షులు కల్లం వెంకట సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గుర్రం జాషువా, భగత్ సింగ్ చిత్రపటాలకు పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గుర్రపుసాల శ్రీనివాసులు, వారిరువురికి ఘన నివాళి అర్పించి దుస్తుల పంపిణీ నిర్వహించారు. అనంతరం గుర్రం జాషువా గురించి భగత్ సింగ్ గురించి వక్తలు ప్రసంగించారు. కళాకారులు పద్యాలను ఆలపించారు.ఈ కార్యక్రమంలో గూడూరి వినోద్, వరికుంట్ల వినోద్ రాజ్, ఎద్దు నగేష్, మానవత జిల్లా మాజీ అధ్యక్షుడు కాకునూరి యలమందారెడ్డి, మాజీ కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, కళాకారులు మొలక పుల్లయ్య, గురవాచారి, యుద్ధం ఆదినారాయణ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.







ముఖ్యమంత్రి పర్యటన పై చర్చల్లో తాళ్ళపల్లి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టెంబర్ 28)

పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయగిరి నియోజకవర్గం రామాపురం నందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా కందుకూరు ప్రాంత అబ్జర్వర్‌గా నియమితులైన మాజీ జిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి తాళ్ళపల్లి సత్యనారాయణ కందుకూరు నందు రాష్ట్ర మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి సభా ఏర్పాట్లు పరిశీలించారు. ప్రజల సౌకర్యాల కల్పన గురించి సమావేశం నందు చర్చించారు.

ఘనంగా అప్పు రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)

అప్పు రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం కాపు కళ్యాణ మండపంలో సోమవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర కార్యవర్గానికి స్టేట్ ప్రెసిడెంట్‌గా మన ప్రకాశం జిల్లాకు చెందిన గౌతమి ఈ టెక్నో స్కూల్ కరస్పాండెంట్ పర్వతరెడ్డి కిషోర్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనందున ఈ కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లాలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు విచ్చేసి ప్రమాణ స్వీకార ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఓడా చైర్మన్ రియాజ్, రవి ప్రియ గ్రూప్ చైర్మన్ కంది రవిశంకర్‌లు పాల్గొన్నారు. ఏపిపిఎస్ఏ స్టేట్ చైర్మన్ అన్వర్ భాషా వీరి సమక్షంలో కార్యవర్గంతో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశంజిల్లాకు చెందిన వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, కాలేజీల ఆధిపతులు పాల్గొన్నారు.

చాగొల్లు గ్రామపంచాయతీ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 28)

ప్రకాశం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చాగొల్లు గ్రామపంచాయతీ నందు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక-పిజిఆర్ఎస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు మండల ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు, ఉలవపాడు తహసిల్దార్ ఏవి రవిశంకర్, ఎంపీడీవో బి సురేష్, పశుసంవర్ధకశాఖ ఏడి జి సురేష్ నాయుడు, డిప్యూటీ ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాసులు, ఎంఈఓ ఎంవి రమణయ్య, సిడిపిఓ డి మాధవి లత, డిప్యూటీ ఎంపీడీవో ఎం జగదీష్, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వివిధ శాఖలకు సంబంధించిన అర్జీలను పిజిఆర్ఎస్ మార్గదర్శికాల ప్రకారం త్వరితగతిన పరిష్కరించుటకు చర్యలు తీసుకొనవలసినదిగా అధికారులను ఆదేశించడం అయినది. అనంతరం పంచాయతీలోని అంగనవాడి కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు.

ముస్లిం స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం అందించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 28)
ఉలవపాడు ముస్లిం స్మశాన వాటికలో కరెంటు లేక ఇబ్బందులు పడుతున్నటువంటి పరిస్థితులను ఉలవపాడు ముస్లిం మైనారిటీ నాయకులు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకుపోగానే వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాలు మంజూరు చేయించడం జరిగింది. వెనువెంటనే ఉలవపాడు ఎలక్ట్రికల్ ఏఈ సాయి బాబా, లైన్ ఇన్స్పెక్టర్ మీరావాలి దగ్గర ఉండి కరెంటు స్తంభాలను, ట్రాన్స్ఫార్మర్‌ను నెలకొల్పించి స్మశానంకు కరెంట్ కనెక్షన్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ అబ్దుల్ కరీం, మసీద్ కమిటీ అధ్యక్షులు అహ్మద్ బాషా, ఉలవపాడు తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులు చిరితోటి గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నూతన మద్యం పాలసీపై అవగాహన

(షణ్ముక వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 28)
ప్రకాశం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆయేషాబేగం, అసిస్టెంట్ సూపరింటెండెంట్ అండ్ ఒంగోలు ఎస్‌హెచ్‌ఓ వెంకట్ ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ లో నియోజకవర్గంలోని రెన్యూవల్ కాని 18 మద్యం దుకాణాలపై మద్యం దుకాణాల లైసెన్సీదారులతో, ఔత్సాహికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2026-27 ప్రభుత్వం వారిచే కొత్తగా ప్రకటించబడిన మద్యం పాలసీ విధి విధానాలను, లాటరీ విధానం ను గురించి మద్యం దుకాణదారులకి వివరించారు. లాటరీ విధానంలో పాల్గొనదలచిన మద్యం దుకాణ లైసెన్సీ దారులు అక్టోబర్ 1న రాత్రి 12 గంటల వరకు ఆన్ లైన్, ఆఫ్ లైన్, హైబ్రిడ్ విధానం ద్వారా పాల్గొనవచ్చుని అధికారులు తెలిపారు. అప్లికేషన్ ఫీజు రూ.3 లక్షలు నాన్ రిఫండ్ కింద గవర్నమెంట్ వారు నిర్ణయించారని చెప్పారు. రెన్యూవల్ కానీ షాప్ లు వరుసగా ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో 10, కొతపట్నం మండల పరిధి లో 4, నాగులుప్పలపాడు మండల పరిధిలో 3, టంగుటూరు మండల పరిధిలో ఒక్క షాప్ ఉన్నాయన్నారు. ప్రతి మద్యం దుకాణానికి పర్మిట్ రూము తప్పనిసరి అని, పర్మిట్ రూమ్ లైసెన్స్ ఫీజును సంవత్సరంలో 3 వాయిదాలలో చెల్లించవచ్చునని తెలిపారు. అప్లికేషన్లను అక్టోబర్ 5న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించి దుకాణాలు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గుర్రం జాషువా జయంతి వేడుకలు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 28)
మండల కేంద్రమైన ఉలవపాడు జివిఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు సోమవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో గుఱ్ఱం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. తెలుగు అధ్యాపకుడు వై సుధాకర బాబు మాట్లాడుతూ జాషువా జీవిత విశేషాలను, నాటి సామాజిక వ్యవస్థలో జాషువా ఎదుర్కొన్న వివక్షత గురించి వివరించారు. తెలుగు సాహిత్యంలో గుఱ్ఱం జాషువా వైశిష్ట్యాన్ని గురించి తెలిపి, ఆయన రచనల గురించి వివరించారు. విద్యార్థులందరూ జాషువా రచనలు చదివి సామాజిక సమానత్వానికి, తెలుగు సాహిత్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఓటర్ల హక్కులను కాపాడాలి
సీఈసీని తొలగించి ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలి

సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 29)
ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని సీపీఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. సోమవారం గాంధీనగర్‌లో సీపీఎం శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 'యూత్ ఫర్ డెమోక్రసీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించడంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు అన్యాయంగా తొలగించి ఉంటే వాటిని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రభావంతో రాజ్యాంగ సంస్థలు పనిచేస్తున్నాయని చీకటి శ్రీనివాసరావు ఆరోపించారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై ప్రజల్లో అనుమానాలు తలెత్తుతున్న నేపథ్యంలో దాని స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ఎన్నికల సంఘం అంతర్గత నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పరిశోధనాత్మక కథనం వెలువరించిందని తెలిపారు. ఆ కథనం ప్రకారం ఓటర్ల చేర్పులు, తొలగింపులు, పునరుద్ధరణలు, ఫారమ్-6 మార్పులు తదితర అంశాలపై కమిషనర్లు అభ్యంతరాలు నమోదు చేసినట్లు వెల్లడైంది. ఓటర్ల జాబితాలో అక్షర దోషాలు లేదా సాంకేతిక తప్పిదాలు అధికారుల వల్ల జరిగితే అందుకు ఓటర్లను బాధ్యులను చేయడం సరికాదన్నారు. ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి ఏర్పడిన ప్రతి అర్హుడికి తన పేరు పునరుద్ధరించుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామక వ్యవస్థలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సభ్యుడిగా చేర్చాలని చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం నిర్ణయాలపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు పారదర్శకమైన, స్వతంత్ర నియామక వ్యవస్థ అవసరమన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడినట్లయితే వాటిని పరిశీలించి పునరుద్ధరించేందుకు సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతిపక్షాలు, పౌరసంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం మాత్రం ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలన్నీ ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఆమోదంతోనే జరిగాయని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై పూర్తి పారదర్శకతతో వివరాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. అనంతరం భగత్‌సింగ్ 119వ జయంతిని పురస్కరించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు ఎస్టీ హుస్సేన్, టి మహేష్, జిల్లా నాయకులు కెఎఫ్ బాబు, స్థానిక నాయకులు సురేష్, దాసు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ట్రాప్‌లో పడొద్దు వారి మాటలు వింటే భవిష్యత్తు ఉండదు

యువతకు సూచించిన ఎంపీ వేమిరెడ్డి

యువత భవితకు భరోసా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి

కూటమి ప్రభుత్వం అన్ని అవకాశాలు కల్పిస్తుందని భరోసా





(షణ్ముఖ వెలుగు, కడప, సెప్టంబర్ 30)
వైసిపి నేతల అబద్ధాలు, అసత్య ప్రచారాలను నమ్మొద్దు. వారి మాటలు విని తప్పటడుగులు వేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయి. వైసిపి ట్రాప్‌లో పడకుండా ఆలోచించి ముందడుగు వేయండి అని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి యువతకు సూచించారు. విద్యార్థులు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా యువత భవితకు భరోసా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. కందుకూరులోని బిఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థలకు చెందిన వివేక జూనియర్ కాలేజీలో సోమవారం కార్యక్రమం జరిగింది. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. మన దేశానికి వస్తున్న పెట్టుబడులలో 25 శాతం రాష్ట్రానికి వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న నమ్మకం, భరోసాయే అందుకు కారణం. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ... అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చంద్రబాబు కొనసాగిస్తున్నారు. కందుకూరు నియోజకవర్గంలో పెద్దఎత్తున జరుగుతున్న అభివృద్ధి పనులే ఉదాహరణ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రోజుకు 20 గంటల పైన కష్టపడుతున్నారు. కేవలం యువతకు బంగారు భవిష్యత్తు కల్పించాలన్నదే వారి లక్ష్యం. ఉద్యోగ ప్రయత్నాలలో విఫలమైతే నిరుత్సాహానికి గురి కావొద్దు. మళ్లీ మళ్లీ ప్రయత్నించండి. ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్ళండి. విదేశాలకు వెళ్లి డబ్బు, అనుభవం సంపాదించాక మళ్లీ స్వదేశానికి తిరిగి వచ్చి, పదిమందికి సాయపడటం మాత్రం మరచిపోకండి అని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు, బిపిసిఎల్, ఇండోసోల్ మరియు వాటి అనుబంధ పరిశ్రమల ద్వారా వేలాది ఉద్యోగాలు రాబోతున్నాయి. ఇప్పటికే జాబ్ మేళాల ద్వారా అనేకమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాము. రాబోయే రోజుల్లో అవకాశాలు మరింతగా పెరుగుతాయి. యువత సద్వినియోగం చేసుకోవాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత భాస్కర్, ప్రిన్సిపల్ అబ్బూరి వెంకటేశ్వర్లు, కాలేజీ ప్రతినిధులు బండి వెంకటేశ్వర్లు, బాలభాస్కర్, నరేంద్ర, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

చట్ట పరిధిలో నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టంబర్ 30)
ప్రజల నుంచి అందే ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో స్వీకరించి, నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో నిష్పక్షపాతంగా పరిష్కరించాలని వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీసు అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుని ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై మొత్తం 127 ఫిర్యాదులను సమర్పించారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ స్వయంగా పరిశీలించి, సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు.



ఫిర్యాదులకు సంబంధించిన చట్టపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వేగంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ శాఖ దృష్టికి నిరభ్యంతరంగా తీసుకురావాలని, చట్ట పరిధిలో పరిష్కరించగల ప్రతి ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో స్వీకరించాలని, చట్ట ప్రకారం నిర్ణీత గడువులో చర్యలు చేపట్టాలని, బాధితుల సమస్యలను సానుభూతితో విని న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్. సుధాకర్, కడప ఇన్‌చార్జి డీఎస్పీ బాలస్వామి రెడ్డితో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రభ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

సనాతనాన్ని ధిక్కరించి సమానత్వానికి పట్టం కట్టిన జాషువా సాహిత్యం..

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)
అంటరానితనం, అవమానాలు, అసమానతల పై తిరుగుబాటుకు తన సాహిత్యాన్ని ఆయుధంగా మలిచిన యోధుడు గుర్రం జాషువా అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కంకణాల ఆంజనేయులు అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో కెవిపిఎస్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ 130 ఏండ్ల క్రితం సమాజంలో సనాతన సంప్రదాయం పేరుతో సాగుతున్న అమానుషమైన కుల వివక్షతకు మహాకవి జాషువా గురయ్యారని, దాన్ని ఎదుర్కొనేందుకు కుల వ్యవస్థ నిర్మూలనకు తన సాహిత్యాన్ని ఆయుధంగా మలిచారని వివరించారు. వాని రెక్కల కష్టంబు లేని నాడు సశ్యరమ పండి పులకింప సంచయించు అని శ్రమజీవుల కష్టం లేకుండా ఒక్క మెతుకు కూడా దక్కదని చెప్పి, అటువంటి శ్రమజీవులకు ఈ సమాజం విలువను ఇవ్వడంలేదని జాషువా ఆవేదన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. తను గొప్ప కవి పండితుడైనా, అనేక బిరుదులు పొందినా, తన కవితల గొప్పతనాన్ని గుర్తించినా, తన కులం పట్ల ఈ సమాజం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందో వాటిపైన కూడా ఆయన కవితలు రాసారని తెలిపారు. ఇట అస్పృశ్యత సంచరించుటకు తావే లేదని స్మశానాల గురించి చెబుతూ పేదవాడికి స్మశానం కూడా కరువైందని ఆనాడు ఆయన వాపోయారని గుర్తు చేశారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కంకణాల ఆంజనేయులు



స్వాతంత్రం వచ్చి 80 ఏళ్ళు గడిచినా నేటికి అనేక దళితవాడలో అంతక్రియలు నిర్వహించుకునేందుకు స్మశాన వాటికలు లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. దోపిడి, అణిచివేతపై తిరుగుబాటు కు పోరాట ఆయుధంగా జాషువా సాహిత్యం అంతా సాగిందని ఆస్ఫూర్తితో కుల వివక్ష లేని సమాజం కోసం సమరం సాగించాలని ఆంజనేయులు అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మతోటి రఘురాం మాట్లాడుతూ జాషువా సాహిత్యం సామాజిక ఉద్యమకారులకు ఎన్నటికీ స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అన్నారు. వందల సంవత్సరాల క్రితం కొనసాగిన అవమానాలు, కుల వివక్ష లక్షణాలు నేటికీ సమాజంలో వివిధ రూపాల్లో కొనసాగుతున్నాయని అన్నారు. జాషువా సాహిత్యాన్ని మరింత అధ్యయనం చేయాలని, సామాజిక మార్పుకు సమానత్వానికి జాషువా సాహిత్యం స్ఫూర్తిగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, జిల్లా నాయకురాలు బి రాజ్యలక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్, వివిధ సంఘాల నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, దేవా, రాజశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శామ్యూల్ జార్జి ఐటిఐ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టెంబర్ 28)
డాక్టర్ శ్యామ్యూల్ జార్జ్ ఐటిఐ కళాశాల ప్లేస్మెంట్ సెల్ విభాగం, ప్రముఖ సీసీ కెమెరా తయారీ సంస్థ సిపి ప్లస్ సంయుక్తంగా సోమవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు కిరణ్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో ఈ యొక్క క్యాంపస్ ప్లేస్మెంట్స్ నిర్వహించడం జరిగిందని ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ జోసెఫ్ తెలియజేశారు. సంస్థ ప్రతినిధులు గంగాధర్, విజయ్ కంపెనీ వివరాలు, వర్క్ కల్చర్ గురించి ఉద్యోగార్థులకు వివరించారు. ఈ ప్రాంగణం ఎంపికలలో పాల్గొన్న సుమారు 30 మంది విద్యార్థులకు 3 లక్షల ప్యాకేజీతో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల సాంకేతిక సలహాదారు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అభినందించారు. ఐటిఐ ప్రిన్సిపల్ ఎస్ జోసఫ్, ఎస్జిఐటి ప్రిన్సిపల్ డాక్టర్ సయ్యద్ ఖాసిం, వైస్ ప్రిన్సిపల్, టిపిఓ డాక్టర్ రాజబాబు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ మస్తానయ్య విజేతలను అభినందించారు.

త్రోవగుంట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం ఆరేళ్ల బాలుడు మృతి

(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, సెప్టెంబర్ 28)
మద్దిపాడు హైవే మొబైల్ పరిధిలో ఒంగోలు-గుంటూరు ప్రధాన రహదారి పై త్రోవగుంట టయోటా షోరూం సమీపంలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఏపి 39 టిసి 6559 నంబర్ గల ట్రాలీ ఆటో గుంటూరు వైపు వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని లారీ ఆటోను సైడ్ నుంచి ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరేళ్ల బాలుడు గురునాథం సీమా రోడ్డు పై పడిపోగా, లారీ టైర్ ఎక్కడంతో తలకు తీవ్ర గాయాలై బాలుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆటో డ్రైవర్ కట్టా కోటయ్య, కనకయ్య కుమారుడు, నూతలపాడు జగన్ కాలనీ వాసిగా గుర్తించారు. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం పై తాలూకా ఎస్ఐ, పీసీఆర్ సిబ్బంది, రోడ్డు సేఫ్టీ సిబ్బందికి సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలు, లారీ వివరాల పై దర్యాప్తు చేస్తున్నారు.





భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఒంగోలులో సర్కు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ భారీ ర్యాలీ మా ఓటు-మా హక్కు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)
షహీద్ భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో సార్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్)కు వ్యతిరేకంగా ఒంగోలు నగరంలో విద్యార్థులు ర్యాలీ అనంతరం రంగారాయుడు చెరువు సెంటర్ వద్ద "మా ఓటు-మా హక్కు", సర్ పేరుతో మా ఓటును తొలగించొద్దు" అంటూ నినాదాలు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి బండి వీరస్వామి అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు కంకణాల ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్, జిల్లా కార్యదర్శి రఘురాం, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన పౌరుల పేర్లను ఎలాంటి కారణం లేకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించకుండా వారి ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఓటర్ల జాబితా నుంచి తొలగించబడిన అర్హులైన ఓటర్ల పేర్లను పునరుద్ధరించాలని, కొత్తగా ఓటు హక్కు పొందుతున్న జెన్ జడ్ యువత పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసి వారి ఓటు హక్కును నిర్ధారించాలని కోరారు.

సిఈసి జ్ఞానేశ్ కుమార్‌ను విధుల నుంచి తప్పించాలి...

సర్ ప్రక్రియ పై తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను విధుల నుంచి తప్పించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఎన్నికల సంఘం స్వతంత్రత, పారదర్శకత, విశ్వసనీయతను కాపాడే విధంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగాలని కోరింది. అలాగే చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో పారదర్శకతను పెంచాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలపై రాజకీయ కక్షసాధింపులకు తావులేకుండా ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించాలని, దేశంలో మహిళలపై జరుగుతున్న హింస, వేధింపులను అరికట్టేందుకు సమర్థవంతమైన చట్ట అమలు, ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని వక్తలు కోరారు.

ఓటు హక్కును కాపాడుకుంటామని ప్రతిజ్ఞ

ర్యాలీ అనంతరం రంగారాయుడు చెరువు సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, యువత "మా ఓటు-మా హక్కు" అంటూ నినాదాలు చేస్తూ తమ ఓటు హక్కును కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షిస్తాం. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లు తొలగించకుండా అడ్డుకుంటాం. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడతాం అని ప్రతిజ్ఞ చేశారు. షహీద్ భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం కోసం విద్యార్థులు ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఎస్సీ ఎస్టీ యాక్ట్ సవరణను రద్దు చేయమన్న పిల్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

2015-2018 ఎస్సీ, ఎస్టీ సవరణ చట్టాన్ని సమర్థించిన సుప్రీమ్ కోర్టుకు దళిత నేత నీలం నాగేంద్ర అభినందనలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 28)
2015, 2018 సవరణ చట్టాలను రద్దు చేయాలని దాఖలైన ప్రజాప్రయోజన వాజ్యం (పిల్) ను కోట్టి వేస్తూ ఎస్సీ, ఎస్టీ యాక్ట్ సవరణను సమర్థించిన సుప్రీం కోర్టుకు దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర తెలిపారు.1989 ఎస్సీ, ఎస్టీ యాక్ట్ అమలు కొరకు ఆనాటి సిఆర్సిసి 438 ప్రకారం నిందితులకు ఏటువంటి ముందస్తు బెయిల్ ఇవ్వకూడదు ఎఫ్ఐఆర్ కేసు నమోదు అయిన వెంటనే నిందితులను అరెస్ట్ చేయాలి.కానీఇటీవల కాలంలో 2012 వ సంవత్సరంలో బీహార్ రాష్ట్రంలో ఆర్నేష్ కుమార్ వర్సెస్ బీహార్ అను గృహహింస కేసులో 7 ఏడు సంవత్సరాల లోపు శిక్ష పడే కేసులో నిందితులను అరెస్టు చేయవద్దు అన్న తీర్పును ఆంధ్రప్రదేశ్లో ఎస్సీ ఎస్టీ కేసుల్లో అమలు చేస్తున్నారు అన్నారు. అగ్రకుల నిందితులకు జగ్రాజ 41 నోటీసులు ఇచ్చి అరెస్ట్ చేయకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలీస్ అధికారులు కోర్టులు ఎస్సీ ఎస్టీ చట్టానికి వక్ర భాష్యం పలుకుతున్నారు. ఎస్సీ ఎస్టీ కేసులో 7 సంవత్సరాల్లోపు శిక్ష పడే కేసుల్లో 41ఆ నోటీసులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం గానీ హోంశాఖ గాని డీజీపీ గాని అధికార ఉత్తర్వులు ఎవరికి ఏ పోలీసు అధికారులకు ఇవ్వలేదన్నారు. బాపట్ల జిల్లాలో చింతాడ ఆనంద్ పాస్టర్ ఎస్సీ కాదంటూ సుప్రీంకోర్టు అతని కుల సర్టిఫికేట్ రద్దు చేసింది అన్నారు. ఈ తీర్పును అలుసుగా తీసుకొని ఇదే అదునుగా భావించి అగ్రకుల మనువాదులు ఎస్సీ ఎస్టీ యాక్టు 2018 ని రద్దు చేయవలసిందిగా సుప్రీంకోర్టులో ఫిల్ వేశారన్నారు. గతంలో 2013లో ఎస్సీ, ఎస్టీ అవసరమా ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌లో ముద్దాయిల పై ఎస్సీ, ఎస్టీ కేసులను వెంటనే కట్టవద్దని విచారించి కట్టాలని ముద్దాయిలైన ప్రభుత్వ ఉద్యోగులను ఉన్నతాధికారుల అనుమతి మేరకే అరెస్ట్ చేయాలంటూ ఇచ్చిన సుప్రీంకోర్టుకు వ్యతిరేకంగా దళితులు భారత బంద్ చేశారన్నారు. ఈ భారత్ బంద్ లో సుమారు 15 మంది దళితులు పోలీస్ కాల్పుల్లో చనిపోయారు అన్నారు అప్పుడు మోడీ ప్రభుత్వం స్పందించి సుప్రీంకోర్టు తీర్పును పార్లమెంట్లో ప్రవేశపెట్టి చట్ట సవరణ చేసి 2015, 2018 సవరణ చట్టం తెచ్చిందన్నారు. ఈ సవరణ చట్టం ప్రకారం అన్ని రాష్ట్రాలకు, అబ్దల్ గఫార్ చేసుకుని ప్రారంభిమించలేదని జీవోలు విడుదల చేసిందన్నారు. కొంతమేరకైనా దళితులకు దేశవ్యాప్తంగా ఉపయోగపడుతున్న 2015-2018 సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, అగ్రకుల మనువాదులు సుప్రీంకోర్టులో పిల్ వేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ సవరణ చట్టం అమలు చేయాలని, రద్దు చేయలేమని సుప్రీంకోర్టులో అగ్రకుల మనువాదులు వేసిన పిల్‌ను కోట్టి వేసి ఎస్సీ, ఎస్టీల రాజ్యాంగ హక్కులను రక్షించినందుకు సుప్రీంకోర్టుకు సోమవారం నీలం నాగేంద్రశీ అభినందనలు తెలియజేశారు తెలిపారు.

ఘనంగా గుఱ్ఱం జాషువా జయంతి వేడుకలు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 28)
రచయిత, విశ్వకవి, సాహితీకారుడు, అభ్యుదయవాది, నవయుగ కవి చక్రవర్తి, పద్మ విభూషణ్, మహాకవి గుఱ్ఱం జాషువ 132 వ జయంతి వేడుకలు పొదిలి పట్టణం, త్యాగరాజ స్వామి సంగీత కళాక్షేత్రం (త్యాగరాజ నగర్)లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ నటులు, త్యాగరాజ సంగీత కళాక్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షులు నాగశ్రీ అధ్యక్షత వహించి తన అధ్యక్షోపన్యాసంలో గుఱ్ఱం జాషువ తన చిన్నతనంలో పాఠశాలలో చదువుకొనే రోజుల్లో, అగ్రవర్ణ ఆధిపత్యంలో కులం పేరుతో చులకనగా, అవహేళన చేస్తే వాళ్ళను ఎక్కడ తగ్గకుండా అదేరీతిలో ఎదర్కొన్న ధైర్యశాలి అన్నారు. తండ్రి వీరయ్య క్రిస్టియన్ ఫాస్టర్ కావడం వలన ఒక వైపు హిందువులు అంటరాని వానిగాను, ఆయన హిందూ మత రచనలు చేయడం వలన మరో వైపు క్రైస్తవ సంఘాలు క్రైస్తవుల ఆగ్రహావేశాలకు లోనైనారన్నారు. ఇలాంటి ఎన్నో అవమానాలు ఎదుర్కొని, గొప్ప, గొప్ప రచనలతో "మధుర శ్రీనాధ" "విశ్వ కవి సామ్రాట్" గా ప్రసిద్ధుడయ్యారన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు ప్రసంగిస్తూ జాషువా సమకాలీన కవిత్వ ఒరవడి అయిన భావ కవిత్వ రీతి నుండి పక్కకు జరిగి సామాజిక ప్రయోజనం ఆశించి గొప్ప రచనలు చేశారన్నారు. వీరు స్వగ్రామం "చాట్రగడ్డపాడు" కావడంవలన వినుకొండ పట్టణంలో నివాసం ఉన్నారు. ఒకసారి వినుకొండలో జరిగిన అవధాన కార్యక్రమంలో పాల్గొని పసంగిస్తున్న గొప్ప విద్యావంతుడు, రచయిత, కవి అయిన గుఱ్ఱం జాషువాని దళితుడు, తక్కువ కులం వాడైన ఇతనని ఈ సభలోకి ఎందుకు రానిచ్చారని కొందరు అవహేళన చేశారని, అదే గుఱ్ఱం జాషువాకి తిరుపతి వేంకట కవులలో ఒకరైన శ్రీ చల్లపిల్ల వెంకట శాస్త్రి జాషువా కాలికి "గండ పెండేరం" తొడిగి ఘనంగా సత్కరించి ఈ కవీశ్వరుని పాదము తాకి నా జన్మ ధన్యం చేసుకున్నను అన్నారు. ఇందుకు ప్రతిస్పందనగా జాషువ ఇది తనకు ఇంతవరకు లభించని అత్యున్నత (పద్మభూషణ్) పురస్కారంలు, బిరుదులు కంటే గొప్ప పురస్కారంగా భావిస్తున్నానని జాషువ పేర్కొన్నారని తెలియజేశారు. కళాభిమాని, ప్రముఖ కాంట్రాక్టర్ కల్లం సుబ్బారెడ్డి ప్రసంగిస్తూ పొదిలి పట్టణంలో త్యాగరాజ స్వామి సంగీత కళాక్షేత్రం ఏర్పాటు చేసి, సంగీత, సాహిత్య, కళా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి, కళా ప్రియులను, కళాభిమానులను ప్రోత్సహించి సహకరిస్తున్న "నాగ శ్రీ"ని ప్రత్యేకంగా అభినందించారు. ఆనాటి సమాజంలో ఉన్న పరిస్థితులు, రుగ్మతలు అగ్రవర్ణ ఆధిపత్యంలో ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదుర్కొని ఆత్మస్థైర్యం కోల్పోకుండా అభ్యుదయ భావాలతో గొప్ప రచనలు చేసి కవితా విశారద, కవిదిగ్గజ, పద్మ విభూషణ్ ఇలాంటి ఎన్నో అవార్డులు, స్వీకరించిన జాషువాని ఈనాటి కవులు కళాకారులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రచయిత, కవి శ్రీ గుఱ్ఱం మల్లికార్జున జాషువా రచించిన "గబ్బిలం" లోని పద్యకావ్యాలను అద్భుతంగా ఆలపించారు. ఈనాడు రిపోర్టర్ షేక్ బాజీ, ఆదిలక్ష్మి ప్రసూన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాభిమానులు వరికుంట్ల వినోద్ రాజు, యరజర్ల గురవాచారి (ఆర్మోనిస్టు), తాళ్లూరి ఎర్రకోటయ్య, కర్ల బ్రహ్మం, ఆదిమూలపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

దువ్వూరు మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అభివృద్ధి పనుల ప్రారంభం..

గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా ఉండాలి



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టంబర్ 28)

గ్రామంలో నివసించే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలంటే ఆ గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా ఉండాల్సిన అవసరం ఉందని మండల ఎంపిడిఓ కె.ధనలక్ష్మి అన్నారు.మండలంలోని మోటుపల్లి పంచాయతీ నందు సోమవారం ఎంపిడిఓ కె.ధనలక్ష్మి అధ్వర్యంలో బిన్ –బ్యాగు కార్యక్రమం నిర్వహించారు. ఇ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ అత్యంత ప్రాధాన్యత అంశం అని అన్నారు.తడి చెత్త పొడి చెత్త వేరు చేయులని అవగాహన కల్పించారు.ఇ కార్యక్రమంలో ఎంపీడీవో కె ధనలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో టి సుధాకర్‌రావు, పి శ్రీనివాసరావు, వివోఎ లు ,అంగన్వాడి వర్కర్స్, ఆశా వర్కర్స్, డ్వాక్రా సంఘాలు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ కు ముడు అర్జీలు



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టంబర్ 28)

మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ నందు అర్ఎస్ డిప్యూటీ తహశీల్దార్ సుజాత, ఎంపిడిఓ కె ధనలక్ష్మితో కలసి పాల్గొని మండల ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలకు సంబంధించి ముడు అర్జీలు అందినట్లు డిప్యూటీ తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటితో పాటు ఎంపిడిఓ కె ధనలక్ష్మి, ఎపిఎం సుబ్బారావు, ఎఈ రాణి, జోసఫ్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



(షణ్ముఖ వెలుగు, దువ్వూరు, సెప్టంబర్ 28)

మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సోమవారం దువ్వూరు మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు ప్రమాదాల్లో గాయపడిన వారిని, మృతుల కుటుంబాలను పరామర్శించి వారికి అండగా నిలిచారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల పార్టీ అధ్యక్షుడికి పరామర్శ

దువ్వూరు మండల టీడీపీ అధ్యక్షులు రమణారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సోమవారం అయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే గారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏ సమయంలోనైనా అండగా ఉంటామని ఎమ్మెలే తెలిపారు.

చింతకుంటలో రూ.2.50 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

అనంతరం దువ్వూరు మండలం చింతకుంట గ్రామంలో రూ.2.50 కోట్ల నిధులతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో నిర్మించిన ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా చింతకుంటతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య సేవలు, మందులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం దువ్వూరు పట్టణంలోని ఎంఆర్ఓ కార్యాలయ ఆవరణలో, మానసిక ఎదుగుదలలో లోపం ఉన్న పిల్లల విద్య కోసం రూ.28 లక్షల నిధులతో నిర్మించిన ప్రత్యేక భవనాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్య, శిక్షణ, అవసరమైన సహాయ సహకారాలు అందేలా ఈ భవనం ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. సమాజంలో ప్రతి చిన్నారికి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు.ఈ పిల్లల కోసం అందుబాటులో ఉన్న సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగిస్తూ, వారికి అవసరమైన విద్యా, శిక్షణా కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం

అనంతరం పెద్ద జొన్నవరం గ్రామంలో కొన్ని నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త రేకులగుంట్ల పెద్ద సుబ్బరాయుడు కుటుంబాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యేకి ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్త కుటుంబానికి టీడీపీ సభ్యత్వం ద్వారా లభించిన రూ.5 లక్షల ప్రమాద బీమా మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్త కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గారు తెలిపారు. కార్యకర్తలకు కష్టకాలంలో పార్టీ, నాయకత్వం తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత

దువ్వూరు మండల పర్యటనలో ఒకే రోజు అభివృద్ధి పనుల ప్రారంభం, వైద్య సదుపాయాల విస్తరణ, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల విద్యకు మౌలిక వసతుల కల్పన, ప్రమాద బాధితుల పరామర్శ, పార్టీ కార్యకర్త కుటుంబానికి బీమా సాయం వంటి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం, పార్టీ కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్థులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు పరామర్శ..
పార్టీ కార్యకర్త కుటుంబానికి బీమా సాయం
టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం











వెలిగొండ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, సెప్టంబర్ 28)



మండలంలోని తోకపల్లి సమీపంలోని సుంకేసుల పునరావాస కాలనీలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సోమవారం పర్యటించారు. పునరావాస కేంద్రంలో నివాసం ఉంటున్న వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులను ఒక్కొక్కరినీ కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు, పునరావాస కేంద్రంలో అందుతున్న మౌలిక సదుపాయాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఇళ్ల పట్టాలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ తదితర సమస్యలను నిర్వాసితులు ఎమ్మెల్యే చంద్రశేఖర్ దృష్టికి తీసుకవచ్చారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం పునరావాస కేంద్రంలోని చర్చి ఆవరణలో నూతన భవన నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సుంకేసుల పునరావాస కాలనీలో ఇంటి నిర్మాణాలకు భూమి పూజ

పెద్దారవీడు మండలం తోకపల్లి గ్రామంలోని సుంకేసుల పునరావాస కాలనీ వద్ద ఇంటి నిర్మాణాల కోసం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొని భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాలే రెడ్డి కృష్ణారెడ్డి రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి ఏరువ సేనా రెడ్డి, నియోజక రైతు ఇవాళ అధ్యక్షులు గుండారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ నాయకులు షేక్ బుజ్జి, ఇంటిలెచ్చివో జిల్లా అధ్యక్షులు అంగరేకులు ఆదినారాయణ, నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య

కడప జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ శర్మకు ఢిల్లీలో అరుదైన గౌరవం
బిజెపి జాతీయ నాయకుల చేతుల మీదుగా
“హిందూ ధర్మం – భారతీయ సంస్కృతి, సంప్రదాయం” పుస్తకావిష్కరణ

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టంబర్ 28)

ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య కడప జిల్లా అధ్యక్షులు, బద్వేల్ ప్రాంతానికి చెందిన యం. సత్యనారాయణ శర్మ ఢిల్లీలోని భారతీయ జనతా పార్టీ (బిజెపి) కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు రామ్ మాధవ్, బిజెపి జాతీయ ప్రధాన కార్యాలయ ఇంచార్జ్ తరుణ్ చూగ్,జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్‌లను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కలయికలో సత్యనారాయణ శర్మ నాయకులకు శాలువా కప్పి, పూలబుకేలు అందించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం తాను రచించిన “హిందూ ధర్మం – భారతీయ సంస్కృతి, సంప్రదాయం” గ్రంథాన్ని జాతీయ నాయకుల చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా రామ్ మాధవ్, బి.ఎల్. సంతోష్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, ధర్మ పరిరక్షణ కోసం సత్యనారాయణ శర్మ అందిస్తున్న సేవలను, ఆయన ఆధ్యాత్మిక కృషిని విశేషంగా అభినందించారు. సమాజంలో సనాతన ధర్మ విలువల వ్యాప్తికి ఇటువంటి పుస్తకాలు ఎంతో దోహదపడతాయని కొనియాడారు. బిజెపి జాతీయ నేతల నుండి ప్రశంసలు అందుకోవడం పట్ల బద్వేల్ ప్రాంత ప్రజలు, బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు సత్యనారాయణ శర్మకు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు యామిజాల నరసింహమూర్తి, రాష్ట్ర బ్రాహ్మణ పెద్దలు పాల్గొన్నారు.





